# గేదెకో నంది

—ప్రతాప రవిశంకర్



సావిట్లో గేదె పెద్దగా అరుస్తోంది. దాని అరుపులు రాజయ్యకు విని పిస్తూనే వున్నాయి.

"దాని అరుపులు వినపట్లా? వెళ్ళి నాలుగు పరకలు గడ్డివేసి రా రాదూ?" అన్నది రంగమ్మ మొగుడితో.

"ఎందుకూ-దానికి మేతదండగ. పాలిచ్చేదా, చచ్చేదా?" అన్నాడు రాజయ్య.

"పాలిచ్చినన్ని రోజులూ తాగి, మిగిలినవి అమ్ముకో లేదూ?" అన్నది ఆమె.

"ఏమైనా ఇప్పుడు మనం దానికి పెట్టేవన్నీ దండగే! ఇదేమైనా మన సొంత గేదా? అమ్ముకోటానికి కూడా వీల్లేదు గదా?" అన్నాడు.

"సర్లే, ఇవన్నీ దానికేం తెల్సు? నోరులేని గొడ్డు మేతకోసం అరుస్తోంది" అని బయటకు వెళ్ళింది రంగమ్మ-గేదెకు మేత వెయ్యటానికి.

రాజయ్య అలా వెళుతున్న భార్యవేపు చూస్తూవుండిపోయాడు. అతని ఆలోచనలన్నీ ఆ గేదె గురించే.



తొమ్మిది నెలల క్రితం రాజయ్య ఆ గేదెను పదిహేను వందలకు

కొన్నాడు. నిజానికి ఆ గేదెను రాజయ్య కొనలేదు. ఓ బ్యాంకు వాళ్ళు ఓ సంస్థ రికమండేషన్ మీద ఆ గేదెను పదిహేను వందలకుకొని రాజయ్యకు ఇచ్చారు- ఆ గేదే తమకు సెక్యూరిటీగా.

రాజయ్య బ్యాంకునుంచి అప్పు తీసుకుని ఒక గేదెను కొనాలనుకుని అందుకు సంబంధించిన వివరాలన్నీ సేకరించాడు.

ఆ వివరాల సేకరణలో అతనికి తెలిసిన విషయాలేమిటంటే, ఒక ప్రభుత్వ సంస్థ వుందనీ, అది ఇలా గేదెలూ ఇతర రకాలైన కోళ్ళు, పశువులు కొనాలనుకునే రైతుల గురించి బ్యాంకులకు రికమండ్ చేసి వాళ్ళకు అప్పులు ఇప్పిస్తుందనీ తెలిసింది.

వెంటనే రాజయ్య ఆ ప్రభుత్వ సంస్థకు వెళ్ళి అక్కడి అధికారులతో తనొక పేద రైతుననీ, ఓ గేదెను బ్యాంకు వాళ్ళ ఆర్థిక సహాయంతో కొనటానికి తన పేరును బ్యాంకుకు రికమండ్ చెయ్యమనీ చెప్పాడు. ఆ సంస్థ అధికారులు అందుకు ఒప్పుకున్నారు. అంతేకాకుండా గేదెను కొనటానికి కావలసిన సొమ్ములో కొంత సొమ్మును ఆ సంస్థ సబ్సిడీ రూపంలో ఇస్తుందనీ, ఆ డబ్బును రాజయ్య తిరిగి చెల్లించవలసిన అవసరం లేదనీ చెప్పారు.

ఆ తర్వాత పనులన్నీ చురుకుగానే సాగాయి.

ఆ సంస్థ వాళ్ళు రాజయ్య గురించి బ్యాంకు వాళ్ళకు రికమండ్ చేశారు. బ్యాంకు వాళ్ళు పదిహేను వందల రూపాయలు గేదెను కొనటానికి రాజయ్యకు మంజూరు చేశారు. ఐతే వాళ్ళు ఆ డబ్బును రాజయ్యకు ఇవ్వలేదు. వాళ్ళే పదిహేను వందల రూపాయలకు సంతలో ఓ మంచి గేదెనుకొని దానిమీద ఆ బ్యాంకు ముద్రవేసి రాజయ్యకు ఇచ్చారు- ఆ గేదెను సెక్యూరిటీగా ఉంచుకొని.

తర్వాత రాజయ్య ఆ గేదెను రెండువేల రూపాయలకు ఇన్సూర్ చేయించాడు.

గేదె ఇంటికి వచ్చిన తర్వాత రాజయ్య భార్య రంగమ్మ గేదెను చూసి తెగ సంతోషపడిపోయింది.

ముచ్చటగా వుంది గేదె. అంతే కాదు- రోజుకు ఐదు శేర్లు పాలిస్తుంది.

ఆ రోజునే రంగమ్మ రోజూ పాలు పొయ్యటానికి ఓ ఆరు

ఇళ్ళలో వాడికలు కుదుర్చుకుని వచ్చింది. నాలుగు రోజులు చిక్కటి పాలు పోసి ఐదోరోజు నించీ అందరిలాగే పాలల్లో నీళ్ళు కలిపి వ్యాపారం సాగించింది రంగమ్మ.

రాజయ్య ఆ గేదె పాలిచ్చినన్ని రోజులూ, దాన్ని బాగానే పోషించాడు. పచ్చి గడ్డి రోజూ కొని వేశాడు. ఇంకా ఇతర రకమయిన మేతను కూడా దానికి వేశాడు.

గేదెకు దురదృష్టపు రోజులు వచ్చాయి. తొమ్మిది నెలల తర్వాత అది పాలివ్వటం మానేసింది. అప్పుడే రాజయ్యకు ఆ గేదె ఒక సమస్యగా తయారయ్యింది. అదే సొంత గేదె అయినట్లయితే ఎట్లాగో దాన్ని మేపే వాళ్ళు. కాని ఆ గేదె తాలూకు డబ్బును బ్యాంకుకు పూర్తిగా చెల్లిస్తేనే అది తన సొంత గేదె అయ్యేది. అప్పటివరకూ అది తనది కాదు. దాన్ని ఎవరికీ అమ్మటానికి వీల్లేదు.

'పాలివ్వని గేదెని ఏం చెయ్యాలి?'

మళ్ళీ అది పాలిచ్చేవరకూ ఆ గేదె మీద సంపాదించిన దంతా తిరిగి దానికే ఖర్చు పెట్టాలి. కాని అలా చెయ్యటం రాజయ్యకు ఇష్టం లేదు.

'మరి తను ఆ గేదెను ఏం చెయ్యాలి?'

రాజయ్యకు ఆ గేదె ఒక సమస్య అయి కూర్చుంది.

'ఏమిటి దీనికి పరిష్కారం?' అని అనుకున్నాడు.

ఆ రోజు చీకటి పడిన తర్వాత రాజయ్య తన మిత్రుడు గోపయ్య దగ్గరకు వెళ్ళాడు. గోపయ్య అప్పుడప్పుడు రాజయ్యకు ఏమయినా సమస్యలు వస్తే వాటి పరిష్కారానికి సూచనలు, చిట్కాలు చెబుతూ వుంటాడు.

రాజయ్య తను ఆలోచిస్తున్న విషయం గోపయ్యకు చెప్పి ఏం చెయ్యాలో చెప్పమని అడిగాడు.

"నువ్వు ఆ గేదెను ఎంతకు కొన్నావు?" అని అడిగాడు.

"పదిహేను వందలు!" చెప్పాడు రాజయ్య.

"అందులో సబ్సిడీ ఎంత?"

"ఆరు వందలు."

"గేదెను ఇన్సూర్ చేయించావు కదా?"

"చేయించాను."

"ఎంతకు?"

"రెండు వేలకు."

ఆ తర్వాత గోపయ్య కొంచెం సేపు ఆలోచించి రాజయ్యకు ఆ గేదె గురించి ఓ పరిష్కార మార్గం చెప్పాడు.

"మరీ అన్యాయం కదా!" అన్నాడు రాజయ్య.

"అన్యాయమా- గోంగూరా! నేను చెప్పినట్టు చెయ్యి" అన్నాడు గోపయ్య చాలా తేలిగ్గా.

ఆ మర్రోజు ఉదయం రాజయ్య గేదెను మేపుకు రావటానికి వూరి బయటకు రైలు కట్ట దగ్గరకు తోలుకెళ్ళాడు.

తర్వాత గేదె మేస్తున్నప్పుడు కొంత గడ్డిని కోసి సిద్ధంగా వుంచాడు.

రోజూ ఆ టైముకు పట్టాల మీదుగా మెయిల్ వెళుతుందని రాజయ్యకు తెలుసు.

ఆ టైమయ్యేసరికి రాజయ్య తను కోసిన గడ్డిని తీసుకెళ్ళి ఓ టర్నింగ్ దగ్గర రైలు పట్టాల మధ్య పడేశాడు.

తర్వాత గేదెను అక్కడికి పిల్చాడు.

గేదె వచ్చి నెమ్మదిగా గడ్డిని తినటం మొదలు పెట్టింది. మెల్లగా రాజయ్య అక్కడినించి జారుకున్నాడు.

రెండు నిముషాల తర్వాత వెనకనించి వేగంగా వచ్చిన మెయిల్ని, గడ్డి తింటున్న ఆ గేదె గమనించలేదు. కాబట్టి మెయిలు క్రింద పడి ముక్కలయి పోయింది.

తర్వాత తతంగ మంతా మామూలుగానే జరిగిపోయింది.

ఇన్సూరెన్స్ కంపెనీ వాళ్ళు వచ్చారు.

గేదె ప్రమాదవశాత్తూ చని పోయింది కాబట్టి, వాళ్ళు రెండువేల రూపాయలు రాజయ్యకు ఇచ్చేశారు. రాజయ్య ఆ డబ్బుతో సబ్సిడీపోను బ్యాంకుకు చెల్లించవలసిన తొమ్మిదివందలూ కట్టేశాడు. మిగిలిన డబ్బులతో అతను ఆ మరురోజే ఓ పాలిచ్చే గేదెను కొని మళ్ళీ పాల వ్యాపారం మొదలు పెట్టాడు. *

**Edited & Published by VIJAYA BAPINEEDU**
**80, Dhanalaxmi Colony, Madras-600 026. and**
**Printed by him at Vijaya Graphics;**
**210-Arcot Road, Madras-600 026 Phone: 422233**